మోదీని మూడోసారి ప్రధానిని చేయాలి

ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న ఈటల

బాలానగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మూడోసారి మోదీని ప్రధానిని చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. దేశాన్ని అభివృద్ధి చేయడంతో ప్రధాని మోదీకి ప్రత్యేక విజన్ ఉందని, దేశ రక్షణ, ప్రజల ఆత్మగౌరవం, ఆర్థికాభివృద్ధి, శాంతి భద్రతలను ఏకకాలంలో అమలు చేసే సత్తా ఆయనకు ఉందన్నారు. శుక్రవారం ఉదయం బీజేపీ నాయకులతో కలిసి బాలానగర్ డివిజన్ శ్రీనగర్, ఇందిరానగర్, బాలానగర్, వినాయకనగర్, ఫిరోజ్‌గూడ బస్తీలలో పాదయాత్ర చేస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన ఈటలను మహిళా మోర్చా నాయకులు, మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. బాలానగర్ అభయాంజనేయ స్వామి, కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం మొదలుకుని 22 ఏళ్లు సేవ చేశానన్నారు. రాష్ట్ర మొట్ట మొదటి ఆర్థిక మంత్రిగా, కరోనా సమయంలో వైద్య శాఖ మంత్రిగా ప్రజలకు సుపరిచితుడినన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మాట్లాడిన మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేదని, సీఎం రేవంత్‌రెడ్డి పాలన ప్రజలకు అర్థమైందన్నారు. ఆచరణకు వీలుకానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తనను మల్కాజిగిరి ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.


హనుమంతుడి వేషధారణలో ఉన్న కళాకారుడితో ఈటల

● న్యాయవాదుల మద్దతు కోరిన ఈటల

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని న్యాయవాదులను బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ శుక్రవారం కోరారు. ప్రశాంతినగర్‌లోని కూకట్‌పల్లి కోర్టు భవనం వద్ద న్యాయవాదులను కలిశారు. బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, వినోద్‌కుమార్ గౌడ్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


ఈటలను ఆలింగనం చేసుకున్న వృద్ధురాలు


మంగళహారతులతో ఈటలకు స్వాగతం పలుకుతున్న మహిళలు


కూకట్‌పల్లిలోని కోర్టు భవనం ఎదుట న్యాయవాదులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, నాయకులు

రంజిత్‌రెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

హైదర్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు కోసం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్‌తో కలిసి ధరణినగర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేరవేర్చుకుంటూ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, బాలస్వామి, రాజబాబు తదితరులు ఉన్నారు.


తాండూరు మండలం మల్కాపూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్‌ను గెలిపించండి

ఎల్బీనగర్: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించడానికి ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ సరూర్‌నగర్ డివిజన్ నాయకులు తెలిపారు. సరూర్‌నగర్‌లోని చౌడి, శివాలయం పరిసర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు బేరే బాలకిషన్, పారుపల్లి దయాకర్‌రెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటే రంజిత్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, ఇమ్రాన్, నహీమ్, అలి, షఫీ, భాస్కర్, గుల్షన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

శంకర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యమని ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు ఎంపి రంజిత్‌రెడ్డి సమక్షంలో శంకర్‌పల్లి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపాల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, ఎజాస్, రాజు, కృష్ణరెడ్డి, శ్రీశైలం, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

ప్రజాసేవ చేయలేని వ్యక్తి విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్: 'వేలకోట్లున్నా ప్రజాసేవ చేయలేని వ్యక్తి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అని, ఆయనకు ఓటు వేసి మీ అమూల్యమైన ఓటును వృథా చేసుకోవద్దు' అని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పార్లమెంటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ గెలిస్తే ఉచిత పథకాలు ఇవ్వదన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్లకు చేసిందేమీ లేదన్నారు. వేల కోట్లున్నా ప్రజలకు సేవ చేయలేదన్నారు. మరోసారి చేవెళ్ల ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

ప్రజాసేవ చేస్తా: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మల్కాపూర్‌లో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరులో రాజకీయం చేయడానికి రాలేదని, సేవ చేయడానికి వచ్చానని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత తాండూరు అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తంచంద్, జనార్ధన్‌రెడ్డి, సంపత్‌కుమార్, రవిగౌడ్, వడ్డె శ్రీను, రాందాస్, రవిసిందే, రఘునాథ్‌రెడ్డి, పండరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో వేసవి శిక్షణ తరగతులు

నిజాంపేట్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో ఈనెల 29 నుంచి మే 24 వరకు చిత్రలేఖనంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిజాంపేట్ సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్ సంస్థ నిర్వాహకులు ప్రముఖ నాసికా చిత్రకారుడు సత్యవోళ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల గల విద్యార్థులు, ఆసక్తి ఉన్న పెద్ద వారు కూడా ఈ చిత్రలేఖనం శిక్షణలో పాల్గొనవచ్చునని తెలిపారు. డ్రాయింగ్, అక్రిలిక్‌కలర్ పెయింటింగ్, పోర్ట్రేట్ డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు 99599 71679, 98494 90663లలో సంప్రందించవచ్చునని రాంబాబు తెలిపారు.

నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కూకట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని నాలాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఈ సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ప్రశాంతినగర్‌లోని కూకట్‌పల్లి కోర్టు సమీపంలోని నాలాలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కేపీహెచ్‌బీకాలనీలో ప్రచారం చేస్తున్న పట్నం సునీతారెడ్డి, కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ పథకాలతోనే పేదలకు లబ్ధి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, గ్యారెంటీ పథకాలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరనుందని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి తెలిపారు. కేపీహెచ్‌బీకాలనీలో కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఆమె పాల్గొన్నారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌కు ఓటు చేయాలని కోరారు. తూము వేణు, జస్వంత్‌రావు, రేష్మ, రజిత, మేకల మైఖేల్, సంజీవరావు, అరవింద్‌రెడ్డి, ఫణీంద్ర, నిలిణీకాంత్ పాల్గొన్నారు.

● నేడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

దుండిగల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్లో శనివారం ఉదయం 10.30 గంటలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించనున్నారు. సమావేశానికి సునీతామహేందర్‌రెడ్డి, శోభారాణి, నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి, హాజరుకానున్నట్లు తెలిపారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పార్టీలోని అన్ని విభాగాలకు చెందిన కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. మూసాపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఓటు బ్యాంకుతో పాటు న్యూట్రల్ ఓటర్లను ఆకర్షించేలా బూత్‌లెవల్ కార్యకర్తలు పని చేయాలన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తూము శ్రీనివాస్, పెంటయ్య, తూము వేణు, సంతోష్, కొప్పిశెట్టి రాఘవేంద్ర, మనోజ్, నారాయణ, వెంకటేష్, చున్ను పాషా పాల్గొన్నారు.


గంగారంలో కాసానికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కాసానికి మద్దతుగా ఎమ్మెల్యే గాంధీ ప్రచారం

చందానగర్: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుక్రవారం చందానగర్ గంగారంలోని పలుకాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి, రాష్ట్రాభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం: ఆరెకపూడి

హైదర్‌నగర్: చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఆయన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, పార్టీ నాయకులతో కలిసి ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ఆ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాశీనాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

● రాయదుర్గంలో బీఆర్ఎస్ ప్రచారం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెన్నం రాజు, జంగయ్య, సతీష్‌ముదిరాజ్, నరేష్, అంజమ్మ, రాజుముదిరాజ్ పాల్గొన్నారు.

● కొండాపూర్‌లో..

గచ్చిబౌలి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ కొండాపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బీ-బ్లాక్‌లో మాజీ కార్పొరేటర్ రవీంద్రముదిరాజ్, సీనియర్ నాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

మహనీయుల సేవలను మరవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహనీయుల సేవలను మరవద్దని, విద్యతోనే పిల్లల్లో జ్ఞానజ్యోతి వెలిగించవచ్చునని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం రాత్రి సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ తెలుగుతల్లినగర్‌లో దళిత సంఘాల ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలోల అక్షరజ్యోతిని వెలిగించడం ద్వారానే జ్ఞానజ్యోతి వెలుగుతుందన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే వంటి మహనీయుల త్యాగాల ఫలితమే నేటి మన జీవన గమనమన్నారు. అటువంటి మహనీయులను ఎన్నటికీ మరవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, మన్నేరాజు, గౌనీ శంకర్,తారాసింగ్,కరాటే శ్రీను, కుమార్, జేమ్స్, గట్టు అశోక్‌వీరేశం, శ్రీపాల్ పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బాలానగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మే 1న నిర్వహించే ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్ కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాలానగర్ శ్రీశ్రీనగర్‌లో ఉన్న ఏఐటీయూసి కార్యాలయంలో పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణ, శ్రీశ్రీనగర్ కార్యదర్శి మనోజ్‌చారీ, ఇందిరానగర్ కార్యదర్శి దావీద్, నాయకులు రాజుగౌడ్, అంజిబాబు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో ఓటర్‌స్లిప్‌ల పంపిణీ


ఓటర్‌స్లిప్‌లను పంపిణీ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ అధికారులు ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేయడం జరుగుతుందని ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. 25, 26 తేదీల్లో మొత్తం 71,258 ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 7,57,874 ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం బీఎల్ఓలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలోని సెక్టార్ ఆఫీసర్ల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఏ సమస్యలు ఉన్న ఓటర్లు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని డీసీ తెలిపారు. సెక్టార్ ఆఫీసర్లు వారికి సంబంధించిన పోలింగ్‌స్టేషన్లు పరిశీలిస్తున్నారని, ఏమైన సమస్యలు ఉంటే యుద్ధప్రాతిపదికన పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రోడ్డుపై వ్యర్థాలు వేసిన నిర్మాణ సంస్థకు జరిమానా

గచ్చిబౌలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలుగజేస్తున్న ఓ నిర్మాణ సంస్థకు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి అధికారులు జరిమానా విధించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నానక్‌రాంగూడలో సుముదుర నిర్మాణ సంస్థ రోడ్డుపై కాంక్రీట్, నిర్మాణ వ్యర్థాలను వేసి వచ్చిపోయే వాహనాలకు ఇబ్బంది కలుగజేస్తోంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు రావడంతో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ విషయాన్ని పారిశుధ్య అధికారులకు తెలిపిన శానిటేషన్ సూపర్‌వైజర్ జలేందర్‌రెడ్డి, డీసీ ఆదేశాల మేరకు సదరు సంస్థకు రూ.25వేల జరిమానా విధించారు. ఇలాంటి ఘటన పునరావృతమైతే లక్షల్లో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని తెలిపారు.

ఔషధ నియంత్రణ సంస్థ అధికారుల దాడులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తులు, న్యూట్రాస్యూటికల్స్ పేరుతో తప్పుగా తయారు చేసి విక్రయిస్తున్న మందులను ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. గురు, శుక్రవారాల్లో కుత్బుల్లాపూర్‌లో దాడులు నిర్వహించారు. ఆక్సీపర్-ఎక్స్‌టి టాబ్లెట్‌ను మార్కెట్‌లో చలామణి చేస్తున్నట్లు గుర్తించారు. ఈ టాబ్లెట్‌లు ఫుడ్ లైసెన్స్ కింద తయారు చేస్తున్నట్లు నిర్ధారించారు. మూత్రపిండాల్లోని రాళ్లు కరిగించడం, పక్షవాతంను నయంచేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై అధికారులు కేసు నమోదు చేశారు. కొన్ని వ్యాధుల చికిత్స కోసం ప్రకటనలు నిషేధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

కూకట్‌పల్లిలో భారీ అగ్ని ప్రమాదం


దుకాణంలో మంటలు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు అనుకొని ఉన్న కూలర్ల విక్రయదుకాణంలో రాత్రి 12 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దుకాణాలకు అనుకొని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ద్విచక్రవాహనాలు, ఆటోలను పార్కింగ్ చేసి ఉండడంతో మంటలు వాటికి కూడా అంటుకొన్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో లక్షల విలువ చేసే 20 కుపైగా ద్విచక్రవాహనాలు, కూలర్లు కాలిపోయాయి. అగ్ని ప్రమాదంపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ధరణి తెచ్చిన తంటాతో భూ వివాదం

● పలువురిపై కేసు

దుండిగల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ధరణి తెచ్చిన తంటాతో గాగిల్లాపూర్ భూపంచాయితీ మొదలై పలువురుపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్ సర్వేనెంబరు 235లో 1969 నుంచి గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మోర రాజయ్య, నర్సింహులు, గణేష్ పేర్లపై భూమి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఎన్నో సంవత్సరాల క్రితం ఉన్న సయ్యద్ రహీమ్ పాషాపై భూమిని అధికారులు రాయడంతో భూ వివాదం మొదలైంది. అయితే రహీమ్ కుమారులు ఇతరులకు ఆ భూమిని విక్రయించగా, ప్రస్తుతం ఆభూమి వివాదం దుండిగల్ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. కాగా గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురుపై దుండిగల్ పోలీసులు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. అయితే మోర గోపాల్ అనే బాధితుడు తమ తాతల కాలం నుంచి ఆ భూమిని సాగు చేశామని, ధరణి కన్నా ముందే తమ పేరుపై ఆ భూమి ఉందని అక్రమంగా తమపై పోలీసులు కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేత అరెస్టు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్ బాలి ప్రాంతానికి చెందిన సద్దాం హుస్సేన్(32) మూసాపేటలోని ఆంజనేయనగర్‌లో నివాసముంటూ కూలీ పని చేస్తుంటాడు. ఇతను అధిక సంపాదనకు ఆశపడి గంజాయి విక్రయించాలని నిర్ణయించుకొన్నాడు. తన సొంతూరు నుంచి గంజాయి తెప్పించి స్థానిక యువత, కూలీలకు విక్రయించడం ప్రారంభించాడు. సమాచారం అందుకొన్న ఎస్సై ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో పోలీసులు సద్దాంహుస్సేన్‌ను గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకొన్నారు. అతడి నుంచి 2 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు.

కోమటికుంటలో అక్రమ నిర్మాణాలపై స్పందన సరిగ్గా లేదు

ప్రభుత్వ న్యాయవాదులపై హైకోర్టు ఆగ్రహం

● ఫొటోలు, సర్వే నివేదిక సమర్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ న్యాయవాదులు సరిగా స్పందించడం లేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా నిర్మించారని ఆరోపణలు ఉన్న వాసవి ఇన్‌ఫ్రా లిమిటెడ్ నిర్మించిన అపార్ట్‌మెంట్లకు సంబంధించిన 8వ, 9వ అంతస్తుల ఫొటోలు, సర్వే రిపోర్ట్ సమర్పించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోమటికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో వాసవి ఇన్‌ఫ్రా భారీ నిర్మాణాలు చేపట్టిందని.. చెరువు భూములను రక్షించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కుత్బుల్లాపూర్‌కు చెందిన ఆకుల సతీశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది టీ వెంకట్‌రాజుగౌడ్ వాదనలు వినిపిస్తూ.. చెరువు భూములు రక్షించాలని రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారులకు ఇచ్చిన విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వాసవి ఇన్‌ఫ్రా తరపున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అపార్ట్‌మెంట్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టలేదని.. ఆ మేరకు అండర్‌టేకింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 50 శాతం ఫ్లాట్స్ ఇప్పటికే విక్రయించినట్లు పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. నీటిపారుదలశాఖ నుంచి తగిన స్పందన లేదని అసహనం వ్యక్తం చేసింది. 8వ, 9వ అంతస్తులపై సర్వే నివేదికను ఈనెల 25న అందజేయాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదా వేసింది.

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండాను గెలిపించండి


చెల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మోమిన్‌పేట్/ ధారూరు/ కులకచర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం పలుచోట్ల ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను నేరుగా పేదలకు అందిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. మోమిన్‌పేట్ మండలంలోని అమ్రాదికుర్దు, అమ్రాదికలాన్ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, సంగమేశ్, సంగారెడ్డి, గణేశ్, చెన్నారెడ్డి, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ధారూరు మండల పరిధిలోని ఎబ్బనూర్, బాచారం గ్రామాల్లో ఎం.రమేశ్, వివేకానందరెడ్డి, పాండుగౌడ్, సుచరితారెడ్డి, విశ్వనాథం, రాజేందర్‌గౌడ్, రాజునాయక్, విజయలక్ష్మి, సాయిగౌడ్, వి.నందు, కృష్ణ, జగదీశ్వర్, అనిల్‌గౌడ్, గిరి, శ్రీకాంత్‌గౌడ్, పరమేశ్, శివ ప్రచారం చేశారు. కులకచర్ల మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నర్సింహారెడ్డి, బీజేవైఎం పరిగి అసెంబ్లీ కన్వీనర్ మహిపాల్, మండల కోశాధికారి కె.మహిపాల్ ప్రచారం చేశారు.

విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం


బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్న అరుణ్‌కుమార్

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీ శక్తికేంద్రం ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 513, 514, 515, 516, 519 బూత్‌ల్లో ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రసాద్, హరిబాబు, కార్తీక్, సాయికుమార్ పాల్గొన్నారు.